


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



– 136 –

## ఎడారిలో రాలిన పూవు

**కోనసీమలోని కనకాయలంక** అనే పచ్చని పల్లెటూరిలో పుట్టిన సుందరి. ఆ లంక గోదావరి తప్ప మరో ఊరు ఎరుగదు. మరో ప్రపంచం వుంటుందని తెలియని అమాయకురాలు. ఆ అమ్మాయి పెద్దలంటే గౌరవం, పిల్లలంటే ప్రేమ కనపరచేది. అందుకే అందరూ ఇష్టపడేవారు.

ఆ ఊరిలో పదో తరగతి వరకే బడి వుంది కాబట్టి అంతవరకే చదివింది. ముసలి తండ్రి రాఘవయ్యకు కంటిచూపు మందగించి ఆపరేషన్ అవసరం అయింది. తల్లి పార్వతమ్మ జబ్బు మనిషి. ఆ ఇంటికి సుందరి ఒక్కతే ఊతకర్ర.

తల్లిదండ్రుల ఆరోగ్యం కోసం అప్పులు చెయ్యాల్సి వచ్చింది. అవి వడ్డీలతో కలిసి కొండలా పెరిగిపోయాయి. అప్పుల వాళ్ల తాకిడి తట్టుకోలేక, ఊరిలోకి కొత్తగా వచ్చిన 'రమ' అనే ఏజెంట్ మాటలు నమ్మి కువైట్ వెళ్ళడానికి సిద్ధమయింది సుందరి.

"కువైట్‌లో పిల్లల్ని చూసుకుంటే చాలు, నెలకు యాభై వేలు జీతం ఇస్తారు. పదినెలల్లో మీ అప్పులన్నీ తీరిపోతాయి" అని రమ ఆశ చూపింది. కానీ, విమానం ఎక్కిన తర్వాత కానీ సుందరికి అర్థం కాలేదు.. తను వెళ్తోంది పని కోసం కాదు, రమ తనను ఒక అరబ్బు సేటుకు రెండు లక్షల రూపాయలకు 'అమ్మేసింది' అని. కువైట్ ఎయిర్‌పోర్టులో దిగగానే ఆమె పాస్‌పోర్టును ఆ సేటు లాక్కున్నప్పుడే సుందరి గుండెలో రాయి పడింది.

ఆ సేటు ఇల్లు ఒక కోటలా ఉంటుంది. పేరుకు పసిపిల్లల సంరక్షణే అయినా, ఇంటి పనులన్నీ సుందరిపైనే పడ్డాయి. సేటు భార్య గయ్యాళి గంపమ్మ. అత్యంత కఠినమైనది. రాత్రి 1 గంట వరకు పని చేయించుకుని, తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేపేది. సుందరి కన్నీళ్లు ఆ గది గోడలకు, ఎడారి నేలకు బాగా తెలుసు.

అయితే, ఆ ఇంట్లోని మూడేళ్ల పిల్లాడు 'అద్నాన్' మాత్రం సుందరిని వదిలేవాడు కాదు. ఆమె పాడే తెలుగు జోలపాటలు ఆ పిల్లాడికి అర్థం కాకపోయినా చిట్టి చిలకమ్మా అమ్మ కొట్టిందా అంటూ పాడేవాడు. ఆమె ఒడిలో హాయిగా నిద్రపోయేవాడు. ఆ పిల్లాడి నవ్వే సుందరికి ఆ నరకంలో చిన్న ఓదార్పు.

ఫోన్ కూడా ఇవ్వని ఆ ఇంట్లో, వారానికి ఒక్కసారి మాత్రమే తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం వచ్చేది. "నేను బాగున్నాను అమ్మా..! త్వరలోనే డబ్బులు పంపిస్తాను" అని అబద్ధం చెప్పి ఫోన్ పెట్టేసి కుమిలిపోయేది సుందరి.

ఒక శుక్రవారం మధ్యాహ్నం, ఇంట్లో అందరూ నిద్రిస్తున్నారు. సుందరి మేడ మీద బట్టలు ఆరేస్తోంది. అద్నాన్ ఆటలాడుకుంటూ మెట్ల దగ్గరకు వచ్చాడు. అకస్మాత్తుగా పిల్లాడి కాలు జారి మెట్ల మీద నుండి దొర్లి కింద పడిపోయాడు.

శబ్దం విన్న సేటు గదిలో నుండి బయటకు పరుగున వచ్చాడు.

కింద పడి ఏడుస్తున్న పిల్లాడిని చూసి సేటుకు రక్తం మరిగిపోయింది. సుందరి భయంతో వణుకుతూ కిందకు దిగి వచ్చింది. "తప్పు నాదే బాబా పిల్లాడిని చూసుకోలేదు. క్షమించండి" అని వేడుకుంది. కానీ ఆ సేటు విచక్షణ కోల్పోయాడు. తన బరువైన బూటు కాళ్లతో సుందరి కడుపులో బలంగా తన్నాడు. ఆమె వెనక్కి పడిపోయి గోడకు బలంగా తల తగిలింది. కడుపులో కలిగిన తీవ్రమైన గాయంతో, అంతర్గత రక్తస్రావం జరిగి, నోటి నుండి రక్తం కక్కుకుంటూ సుందరి అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది.

చనిపోయిన సుందరిని చూసి సేటు భయపడలేదు, తన మీదకు కేసు రాకుండా ఉండాలని ఆలోచించాడు. వెంటనే ఇండియాలో ఉన్న ఏజెంట్ రమకు వీడియో కాల్ చేశాడు. చనిపోయిన సుందరి శవాన్ని చూపించాడు. రమ షాక్ తిన్నప్పటికీ, వెంటనే తనలోని స్వార్థం మేల్కొంది.

"నీ మనిషి చచ్చిపోయింది. పోలీస్ కేసు అయితే నీకు డబ్బు రాదు, నాకూ తిప్పలు తప్పవు.

నేను చెప్పినట్టు చెయ్.. నీ అకౌంట్‌లో ఐదు లక్షలు వేస్తాను" అని సేటు బేరం పెట్టాడు. డబ్బు అంటే ప్రాణం ఇచ్చే రమ వెంటనే ఒప్పుకుంది.

"నువ్వు ఒక పని చెయ్ సేటు.. ఆమె దొంగతనం చేస్తూ పట్టుబడగా, పారిపోయే క్రమంలో కరెంటు వైర్లకు తగిలి చనిపోయిందని కథ అల్లు, మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అని సలహా ఇచ్చింది. సాయంత్రానికల్లా సుందరి మృతదేహాన్ని బయట గోడమీద పడేసి, ఆమె చేతిలో నోట్ల కట్టలున్న సంచిని పెట్టి అక్కడ కరెంటు వైర్లు తెగి ఉన్నట్లు దృశ్యాన్ని సృష్టించారు. ఫోటోలు తీసి ప్రూఫ్ ఇదే అని పోలీసులకు, చుట్టూ వున్నవారికి చూపించాడు. రమకు కూడా పంపించి ఊళ్ళో అందరికీ చూపించి సుందరి దొంగతనం చేసినట్లు చెప్పమన్నాడు.

ఇండియాలో రమ హడావుడిగా వెళ్ళి సుందరి తల్లిదండ్రులకు ఈ దారుణ వార్తను చెప్పింది. "నీ కూతురు దొంగతనం చేసిందంట. గోడ దూకి పారిపోతుంటే కరెంటు షాక్ కొట్టి చచ్చిపోయింది. శవం కూడా ఇండియాకు రాదు, అక్కడే సమాధి చేస్తారు" అని నిర్దాక్షిణ్యంగా అబద్ధం చెప్పింది.

రాఘవయ్య ఆ మాటలు నమ్మలేదు. "నా కూతురు పరాయివాడి పైసా ఆశించదు తల్లి.. ఆమె దొంగ కాదు. మా పాపను మాకు అప్పగించండి" అని రమ కాళ్ల మీద పడి ఏడ్చాడు. కానీ రమ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి మాయమైపోయింది. ఊరంతా సుందరిని దొంగ అని తప్పుగా మాట్లాడుతుంటే, ఆ ముసలి ప్రాణాలు తల్లడిల్లిపోయాయి. ఊరిలో రమ మనుషులు రాఘవయ్య ఇంటికి వెళ్లి, "నోరు మూసుకుని ఉండండి, లేకపోతే మీకూ అదే గతి పడుతుంది" అని బెదిరించారు.

కథ ఇక్కడే మలుపు తిరిగింది. ఇంట్లో పిల్లాడి గదిలో ఒక చిన్న స్మార్ట్ కెమెరా ఉంది. ఆ కెమెరాలో సేటు సుందరిని తన్నడం, ఆమె చనిపోవడం అంతా రికార్డ్ అయింది. సేటు ఆ ఫుటేజీని డిలీట్ చేశానని అనుకున్నాడు, కానీ అది క్లౌడ్ స్టోరేజ్‌లో సేవ్ అయింది.

ఆ ఇంట్లో పనిచేసే మరో పనిమనిషి, ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన 'మరియా', సుందరి పట్ల ఉన్న జాలితో, సేటు ప్రవర్తన పట్ల కోపంతోనూ వున్నది. అందుకే ఆ వీడియోను తన ఫోన్‌లోకి తీసుకుంది. ఆమె ధైర్యం చేసి ఆ వీడియోను కువైట్‌లోని ఇండియన్ ఎంబసీకి మరియు సుందరి గ్రామానికి చెందిన ఒక యువకుడికి ఫేస్‌బుక్, మెసెంజర్ ద్వారా పంపింది.

ఆ వీడియో సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించి వైరల్ అయ్యింది. సుందరి ఊరి వాళ్లకు అసలు నిజం తెలిసింది. "మా అమ్మాయి నిర్దోషి" అని ఊరంతా ఒక్కటైంది. స్థానిక యువకులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి సుందరికి న్యాయం చెయ్యమని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. విషయం మీడియాలో హైలైట్ కావడంతో ప్రభుత్వం వెంటనే స్పందించింది.

ఏజెంట్ రమ ఇంటిపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఆమె డైరీలో సేటు పంపిన ఐదు లక్షల రూపాయల లావాదేవీల సాక్ష్యం, అక్రమమార్గంలో సంపాదించిన డబ్బు వివరాలు దొరికాయి. పోలీసులు రమను అరెస్ట్ చేసి విచారించగా, ఆమె అసలు నిజాన్ని ఒప్పుకుంది.

ఇండియా ఎంబసీ నుండి,అంతర్జాతీయ ఒత్తిడి పెరగడంతో కువైట్ పోలీసులు సేటును అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా అతనికి కఠిన కారాగార శిక్ష పడింది. సుందరి దొంగ కాదు, కఠినాత్ముడైన కువైట్ సేటు రాక్షసత్వానికి, ఏజెంట్ రమ ధన దాహానికి బలిపశువు అయింది అని ప్రపంచానికి తెలిసింది.

చివరికి, ప్రభుత్వం చొరవతో సుందరి భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. అమాయకురాలైన సుందరికి నివాళిని అర్పిస్తూ ఊరంతా కన్నీటి వీడ్కోలు పలికింది. రాఘవయ్య, పార్వతమ్మలు తమ కూతురు మృతదేహంపై పడి

ఏడుస్తూ, "మా బిడ్డ దొంగ కాదు అని లోకానికి తెలిసింది.. మాకు అదే చాలు" అని విలపించడం చూసి అక్కడి వారందరి కళ్లు చెమర్చాయి.

భారత ప్రభుత్వం చొరవ తీసుకుని కువైట్ ప్రభుత్వానికి మొర పెట్టి హంతకుడైన సేటు నుండి 4 వేల దినార్లు వసూలు చేసి సుందరి తల్లిదండ్రులకు ఇప్పించింది.

ఆ డబ్బు వారికి అప్పులు తీర్చడానికి జీవన భృతికి అవసరమైనది.

డబ్బు మనిషిని రాక్షసుడిగా మార్చవచ్చు, కానీ నిజాన్ని ఎప్పటికీ పాతిపెట్టలేదు. ఈ కథ కేవలం సుందరిది మాత్రమే కాదు, పరాయి దేశాలకు వెళ్లి మాయాజాలంలో చిక్కుకుంటున్న ఎందరో నిరుపేదల ఆక్రందన.

ఆ ఏజెంట్ రమకు జీవితఖైదు పడింది, ఒక అమాయకురాలిని చంపినందుకు ఆ కువైట్ సేటు ఎడారి జైలులో మగ్గిపోతున్నాడు.

(మరోకథ వచ్చేనెల)

Post your comments